


20న ఏకలవ్య ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐడిబిఐ పరిధిలో ఉన్న భామిని, మెళియపుట్టి ఏకలవ్య గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఈనెల 20న ప్రవేశ పరీక్ష మార్చబడిందని డిడి అన్నదొర ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న నిర్వహించు ప్రవేశపరీక్ష ఈనెల 20కి వాయిదా వేసినట్లు తెలిపారు. ఏకలవ్య గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతుల మిగిలిన సీట్లకు ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

మండుటెండలో ఉపాధి కూలీల అవస్థలు

- కనీస వసతులూ కరువే..
- బకాయి రాక బతుకు బరువు
- కుటుంబ పోషణకు కూలీలు అవస్థలు

ప్రజాశక్తి - కురుపాం

గ్రామాల్లో వ్యవసాయ కార్మికులు వలసలు నివారించేందుకు కేంద్రప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం రూపొందించింది. ఇందులో భాగంగా పనిచేసే ప్రతి వ్యసాయ కార్మికుడికి ఉపాధిహామీ చట్టం జాబ్ కార్డులను అందజేశారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు... పని పదేశాల్లో కూలీల కోసం కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా వేసవిలో టెంట్లు ఏర్పాటు, మజ్జిగ, మంచినీళ్లు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని, ప్రథమ చికిత్స కిట్లును అందుబాటులో ఉంచాలని, వేసవి రోజుల్లో పని చేసే కూలీలకు అదనపు కూలి ఇవ్వాలి ఆ చట్టంలో పేర్కొంది. అయితే బిజెపి అధికారంలోకి వచ్చాక ఈ చట్టంలో పలు సవరణలు తీసుకొచ్చింది. ఉద్దేశ పూర్వకంగా ఈ చట్టాన్ని నీరుగార్చేలా సరవణలు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు గరిష్టవేతనం అందడం లేదు. ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణలతో పని ప్రదేశాల్లో నీడ కోసం టెంట్ల ఏర్పాటు, మజ్జిగ ఫ్యాకెట్ల పంపిణీ, తాగునీరు వంటి సౌకర్యాలు లేక సమీప బోరుల్లో నుంచి ఇంటిల్లో నుంచి తాగునీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది.

ఏడు వారాలుగా వేతనాలు పెండింగ్

ప్రస్తుతం ఎటువంటి పనుల్లేకపోవడంతో కూలీలకు పనులు దొరకడం కష్టంగా ఉంది. తప్పని పరిస్థితుల్లో ఉపాధిహామీని నమ్ముకొన్న తరుణంలో ఈ పనులపైనే కూలీలు ఆధారపడి ఉన్నారు. వ్యవసాయం అంతగా కలిసి రాకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు సైతం ఉపాధి పనులకు వెళ్తున్నారు. పని చేసిన ఒకటి, రెండు వారాల్లో కూలీల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తారు. కూలీల వివరాలను క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి వారం మండల కార్యాలయానికి పంపుతారు. వారుచేసిన పనిని బట్టి ప్రతి సోమవారం ఆన్లైన్లో నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన రెండు రోజులకు కూలీల ఖాతాల్లో నగదు జమవుతుంది. కానీ వివరాలు నమోదు చేసి 40 రోజులు దాటుతున్నా వేతనాలు చెల్లించడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి మూడో వారం నుంచి ఇప్పటి వరకూ చేసిన పనులకు వేతనాలు మంజూరు కాలేదు. వాస్తవానికి మార్చి నెలకు మొత్తం వేతనం పడాల్సి ఉన్నప్పటికీ ఇంతవరకు పడలేదు.

అరకొర వేతనాలు

మండుటెండల్లో రెండు పూటలా పని చేస్తున్నా అరకొర వేతనాలే అందుతున్నాయని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజు వారీ వేతనాన్ని ప్రభుత్వం స్వల్పంగా పెంచింది . కానీ పలు ప్రాంతాల్లో రూ.270 మించి రావడం లేదని పలువురు కూలీలు తెలిపారు. గతంలో వేసవిలో ఉపాధి పనులు చేసేవారికి ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30 శాతం చొప్పున వేసవి అలవెన్స్లు అందజేసేవారు. మజ్జిగ కూడా సరఫరా చేసేవారు. 2022- 23 ఆర్థిక సంవత్సరం నుంచి వీటన్నింటినీ రద్దు చేశారు. దీంతో వేతనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సకాలంలో అందక అప్పులు

వేసవిలో వ్యవసాయ, ఇతర పనులు ఉండడం లేదు. దీంతో గత్యంతరం లేక ఉపాధి పనులకు వెళ్తున్నాం. సకాలంలో వేతనాలు మంజూరు చేయడం లేదు. మండుటెండలో చేస్తున్న పనులకు తగిన ప్రతిఫలం అందడం లేదు. అప్పులు చేసి కుటుంబాలను పోషించు కుంటున్నాం. ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతనాలు, వేసవి అలవెన్స్ మంజూరు చేయాలి.

ఎం.పండయ్య
కురుపాం గ్రామం.



కురుపాంలో ఎండలో ఉ.పాధి పనులు చేస్తున్న కూలీలు

గరుగుబిల్లి : మండలంలో ఉపాధి వేతనదారులు అసౌకర్యాల నడుమ అవస్థలుపడి పనులు చేస్తున్నారు. మండలంలోని 10750 జాబ్ కార్డులు ఉన్నాయి. జాబ్కార్డు ఉన్న ప్రతి వేతనదారులు ప్రతిరోజు పనిలో పాల్గొంటున్నారు. అయితే వేసవి తాపం తాటతీస్తున్న తరుణంలో తీవ్ర అవస్థలుపడుతున్నారు. మార్చి నెల నుంచి తీవ్రమైన ఎండలు మండుతున్నాయి. అయినా ఎక్కడా టెంట్లు గానీ, తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పించిన దాఖలాల్లేవు.

వీరఘట్టం : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం ద్వారా చేపడుతున్న పని ప్రదేశాల్లో నీడ కరువైంది. పని జరుగుతున్న ప్రాంతాల్లో కనీస సౌకర్యాలైన టెంట్లు, మంచినీటి సౌకర్యం లేక ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమీపంలో ఉన్న చెట్ల నీడను ఆశ్రయించి అలసట పొందుతున్నారు.

పని ప్రాంతాల్లో తాగునీరివ్వాలి

గతంలో పనిచేస్తున్న ప్రదేశాల్లో మంచినీరు ఏర్పాటు చేసేందుకు గ్రూప్లో ఒక్కరిని మంచినీళ్ల కోసం ఏర్పాటు చేయడం జరిగింది. అయితే ఇప్పుడు ఎవర్నీ ఏర్పాటు చేయకపోవడంతో పని జరిగే ప్రదేశం ఊరికి దూరంగా ఉండడం. తాగేందుకు నీరు లేక అవస్థలు తప్పడం లేదు.

కేతిరెడ్డి గౌరినాయుడు,
వేతన దారుడు , నాగూరు గ్రామం,
గరుగుబిల్లి మండలం.

పని ప్రదేశాల్లో మజ్జిగ, టెంట్లు ఏర్పాటు చేయాలి

వేసవికాలంలో ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల వేతనదారులకు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. కావునా ప్రభుత్వం పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేసి మజ్జిగను అందజేసి ప్రాథమిక మెడికల్ కిట్లను ఏర్పాటు చేసినట్లయితే వడదెబ్బకు గురవ్వకుండా సురక్షితంగా ఉంటాం.

జి. సంతోషిని
ఉపాధి హామీ మేట్ కురుపాం.

గత పది రోజుల నుంచి ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి సుమారు 4362 మంది వేతన దారులు పనిలో పాల్గొంటున్నట్లు ఉపాధి హామీ చట్టం అధికారులు గణాంకాలు చెబుతున్నారు.

ప్రభుత్వం నుంచి నిధులు రావడంలేదు...

ప్రతి పంచాయతీకి 4 లేక 5 టెంట్లు ఇచ్చాం. తాగునీటి సదుపాయం కూడా కల్పించాం. అయితే ప్రస్తుతం ప్రభుత్వం వీటికి నిధులు మంజూరు చేయకపోవడంతో తామేమీ చేయలేకపోతున్నాం. కొన్ని గ్రామాల వేతనదారులు ఎవరి నీరు వారే తెచ్చుకుంటున్నారు.

ఎం.గౌరీనాథ్,
ఎపిఒ, గరుగుబిల్లి.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్కుమార్

ముమ్మరంగా తనిఖీలు చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ముమ్మరం చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ అన్నారు. రిటర్నింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎన్నికలు పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. నాలుగు నియోజక వర్గాల్లో 48 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 36 స్టాటిక్ సర్వేలియన్ల బృందాలు, 16 వీడియో సర్వేలియన్స్ బృందాలు, 4 వీడియో వ్యూయింగ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాల పనితీరు కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తాయని ఆయన చెప్పారు. ప్రజలు సమాచారాన్ని 1950 టోల్ ఫ్రీ నెంబరుతో సహా సి-విజిల్, ఆన్ లైన్ ఫిర్యాదుల విభాగంలో సైతం అందించవచ్చు అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తమ తనిఖీలు ముమ్మరం చేయాలని, ఎన్నికల ప్రలోభాలకు సంబంధించి ఎటువంటి రవాణా జరుగుతున్నా, కార్యకలాపాలు సాగుతున్న నిర్ణీత సమయంలో తనిఖీలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. సి విజిల్ ఫిర్యాదులు పరిష్కారంలో మరింత వేగాన్ని పెంచాలని ఆయన స్పష్టం చేశారు. సరిహద్దు చెక్పోస్టుల వద్ద వెబ్ కాస్టింగ్ విధిగా చేయాలని ఆయన ఆదేశించారు. అంతర్ రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల వద్ద గట్టి నిఘా ఉండాలని, మద్యం, గంజాయి, ఇతర సామగ్రి రవాణాకు అవకాశం ఉందని ఆయన సూచించారు. ప్రచారాలకు రాజకీయ పార్టీలు సువిధ యాప్ ద్వారా ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై చర్యలు

పార్వతీపురం: సార్వత్రిక ఎన్నికలను శాంతియుతంగా, స్వేచ్ఛగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా పేర్కొన్నారు. శనివారం జిల్లాల ఎన్నికల అధికారులు, ఎస్పిలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ఎన్నికల ఏర్పాట్లను సమీక్షించారు. గంజాయి, మద్యం, నగదు, ఉచితాల అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా ఉంచాలని, రాష్ట్రాల సరిహద్దులు, జిల్లాల సరిహద్దుల్లో ఉండే చెక్ పోస్టులో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. జప్తు సమయంలో వ్యాపారులు, సాధారణ పౌరుల విషయంలో ఆచీతూచీ అడుగువేయాలని, వారిని ఎటువంటి ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. నగదు జప్తు కేసులను 24 గంటల్లోనే పరిష్కరించాలని, ఇందుకు రాష్ట్రమంతా ఒకే విదానాన్ని అనుసరించేలా త్వరలో ఒక విధానాన్ని రూపొందించనున్నట్లు తెలిపారు. భారత ఎన్నికల సంఘం రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక పరిశీలకును నియమిం చిందని, వీరు నేరుగా ప్రధాన ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో పనిచేస్తుంటారని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్పి విక్రాంత్ పాటిల్, సీతంపేట ఐటిడిఎ పిఒ, పాలకొండ శాసన సభ నియోజక వర్గం ఆర్ఒ కల్పనా కుమారి, పార్వతీపురం పిఒ, సాలూరు శాసనసభ నియోజక వర్గం ఆర్ఒ సి.విష్ణుచరణ్, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఇన్ఛార్జ్ డిఆర్ఒ జి.కేశవ నాయుడు, పార్వతీపురం ఆర్డిఒ, శాసనసభ నియోజకవర్గం ఆర్ఒ కె.హేమలత, పాలకొండ ఆర్డిఒ, కురుపాం శాసన సభ నియోజక ఆర్ఒ వి వెంకట రమణ, ఎస్డిసి ఆర్వి సూర్యనారాయణ, నోడల్ అధికారులు ఒ.ప్రభాకర రావు, వి.తిరుపతయ్య, ఎం.వి.కరుణాకర్, లోచర్ల రమేష్, సహాయ పోస్టల్ సూపరింటెండెంట్ ఇమంది మురళి తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి


సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - పాచిపెంట

జాతీయ ఉద్యమ స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న హక్కులను భారత రాజ్యాంగాన్ని కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని, వచ్చే ఎన్నికల్లో వీటిని సాగనంపాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని కోడికాళ్లవలస జంక్షన్ వద్ద ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు సూకూరు అప్పలస్వామి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సభలో కృష్ణమూర్తి మాట్లాడుతూ ఎర్రజెండా నాయకత్వంలో పోరాడి సాధించుకున్న అటవీ హక్కు, ఉపాధి హామీ, కార్మిక హక్కుల చట్టాలను కాలరాస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అంబానీ, అదానీల ఆస్తులను పెంచుతూ ప్రజలపైన భారాలు వేస్తోందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని సర్వనాశనం చేసి తిండిగింజలు లేకుండా చేసి కార్పొరేట్ల చేతుల్లో వ్యవసాయ రంగాన్ని పెడుతుందని పోరాటం చేసిన రైతాంగంపై కాల్పులు జరుపుతూ భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు అని చెప్పి యువతను మోసగించిందని, మతం పేరుతో ప్రజలను చీల్చుతూ కలిసి ఉన్న కుటుంబాలను విడదీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్లో జరిగిన గిరిజనులపై దాడులు, అత్యాచారాలను దేశ ప్రజలంతా ఖండించాలని, పోరాడి సాధించుకునే గిరిజన చట్టాలను కాపాడుకోవాలని, మూసి ఉన్న పరిశ్రమలు తెరిపించేలా యువతకు ఉపాధి కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థల కాపాడుకోవాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. నిత్యం ప్రజల కోసం పనిచేస్తున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించుకోవాలని, ఆంధ్ర రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపిని తిప్పి కొట్టాలని, ఇంత ద్రోహం చేసిన బిజెపికి మద్దతు ఇచ్చే పార్టీలన్నింటినీ వ్యతిరేకించి ఎర్రజెండా అభ్యర్థులను గెలిపించుకొని హక్కుల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, మర్రి శ్రీనివాసరావు, గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు మంచాల శ్రీనివాసరావు, జర్నీ రామయ్య, నిర్వాసిత సంఘం నాయకులు బి.అభిమన్యుడు, రైతు సంఘం మండల కార్యదర్శి బి.గౌర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కృష్ణమూర్తి



సంతలో ప్రచారంచేస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి, కార్యకర్తలు

కొమరాడ : నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఎర్రజెండా తరపున పోటీ చేసే ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. శనివారం కూనేరు సంతలో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ గిరిజన ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పైన పోరాడుతున్న సిపిఎం తరపున కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణను, అరకు పార్లమెంటు అభ్యర్థి అప్పలనర్స పోటీ చేస్తున్నారన్నారు. వీరికి అత్యధిక ఓట్లు వేసి గెలిపించేందుకు గిరిజన యువతీ యువకులు ముందుకు రావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన హక్కులను కాలరాసేలా రోజుకొక చట్టాన్ని తెచ్చి గిరిజన బతికులను విస్తరాకు మాదిరిగా చిందరవందర చేసే పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి సందర్భంలో ఈరోజు రాష్ట్రంలో అన్ని పార్టీలు కుస్తీ పడుతూ కేంద్రంలో దోస్తీగా కలిసిపోయే ఈ పార్టీలను నమ్మొద్దని ఆన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన గిరిజన వ్యతిరేక చట్టాలను ఈ పార్టీలన్నీ బలపరుస్తూ గిరిజనులకు అన్యాయం చేసే పరిస్థితి ఉందని ఇలాంటి సందర్భంలో గిరిజన హక్కులు కాపాడేలా సిపిఎం తరపున ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులు పోరాటం చేసే పరిస్థితి ఉందని, కావున సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో నాయకులు బాబురావు, గిరిజనులు పాల్గొన్నారు.

పేదల భూములపై రోడ్లు వేస్తారా?

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని డోకిశిల రెవెన్యూలో శనివారం అనుమతుల్లేకుండా గిరిజనులు భూములపై రహదారుల వేస్తారనని సిపిఎం నాయకులు పి.రాము ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం రోడ్డు పనులను గ్రామస్తులతో కలిసి అడ్డుకున్నారు. అనంతరం రాము మాట్లాడుతూ డోకిశీల రెవెన్యూలోని తేలునాయుడు వలసకు చెందిన కొంతమంది పేదల భూములపై శనివారం యంత్రాలతో గుర్తు తెలియని వ్యక్తులు రహదారి పనులు ప్రారంభించారని, దీన్ని తాము ప్రతిఘటించి రహదారి పనులు ఏ శాఖ వారు నిర్వహిస్తున్నారు, అనుమతులు ఎవరు ఇచ్చారు ఎప్పుడు ఇచ్చారు, ఈ పనులు ఎవరు చేయిస్తున్నారు అన్న నిలదీసి అడగ్గా ఎటువంటి సమాధానం చెప్పలేదని అన్నారు. దీనికి బాధ్యులుగా వెలగవలస పంచాయతీకి చెందిన సన్నిబాబు అనే వ్యక్తి చేస్తున్నట్లు తెలిసింది. ఎవరికి ప్రయోజనం లేని ఈ రహదారులు అధికార పార్టీకి చెందిన కొంతమంది వ్యక్తులు చేయడం శోచనీయమని, ఎన్నికల కోడ్ ఉండగా ప్రభుత్వ పనులు చేపట్టకూడదని తెలిసినా, ఇలాంటి పనులకు పూనుకోవడం బరితెగింపు చర్యగా భావించి, ఈ పనులను ఆపకుంటే జిల్లా కలెక్టర్, డిఆర్ఒకు ఈ విషయమై ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.



పేదల భూముల్లో వేస్తున్న రోడ్డును చూపుతున సిపిఎం నాయకులు రాము

ఎండల తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఎండల తీవ్రత దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం పరశురాంపురంలో ఉపాధిహామీ వేతనదారులకు వేసవి దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించి అవగాహన కల్పించారు. బయట ఉష్ణోగ్రతలు కారణంగా శరీరం ఎక్కువ నీరు, లవణాలను కోల్పోతుందని, వాటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని, నీరు, నిమ్మరసం, మజ్జిగ, ఒఆర్ఎస్, కొబ్బరినీళ్లు, ఇంకా ఇంటి వద్ద అందుబాటులో ఉన్న ద్రావణాలు తాగుతూ ఉండాలన్నారు. పనుల నిమిత్తం ఉదయం ఇంటి దగ్గర బయల్దేరే ముందు తప్పని సరిగా ద్రవరూపంలో ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని, తాగు నీరు వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు వైద్య సిబ్బంది వద్ద గ్రామాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా ఒఆర్ఎస్ ప్యాకెట్ను నీటిలో కలిపే విధానాన్ని అక్కడ వైద్య సిబ్బందిచే చేసి చూపించి, అక్కడ ప్రజలకు ఒఆర్ఎస్ ద్రావణాన్ని తాగించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ వడదెబ్బకు గురయ్యే సమయంలో తలనొప్పి, తలతిరగడం, వికారం, జ్వరం, స్పృహ కోల్పోవడం, అపస్మారక స్థితి మొదలగు లక్షణాలు ఉంటాయని వివరిస్తూ, ప్రాథమికంగా వెంటనే చేపట్టాల్సిన చర్యలను ఒక డెమో రూపంలో చేయించి, ప్రదర్శించి అందరికీ అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించారు. ఇంకా అపస్మారక స్థితిలో ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రానికి, ఆసుపత్రికి తరలించాలన్నారు. గ్రామాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఆరోగ్య పరిశీలన చేశారు. పిల్లలకు తరచుగా నీరు తాగించాలని ఎవరికైనా జ్వరం అనిపిస్తే వెంటనే తెలియజేయాలన్నారు.



ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వేతనదారులకు వివరిస్తున్న జగన్మోహనరావు

డ్రైడే కార్యక్రమం

గ్రామంలో వైద్య సిబ్బంది నిర్వహించిన డ్రైడే కార్యక్రమాన్ని డిఎంఒ పరిశీలించారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలు గుర్తించడంపై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. జ్వర లక్షణాలున్న వారు ఎవరైనా ఉన్నారా అని తెలుసుకున్నారు. జ్వర నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, పిహెచ్ఎన్ విజయకుమారి, వైద్య సిబ్బంది రామకృష్ణ, లత, ప్రమీల, ఉపాధిహామీ సిబ్బంది ఎల్లయ్య,జ్యోతి, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వాలంటీర్ల 'రాజీ' నామాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



జిల్లాలో గ్రామ, వార్డు వాలంటీర్ల రాజీనామాలు చర్చ నీయాశంగా మారాయి. వాలంటీర్లంతా రాజీనామాలు చేయండి, తిరిగి వైసిపి అధికారంలోకి వస్తే తిరిగి అవకాశం కల్పిస్తాం అంటూ వైసిపి నాయకులు, అక్కడక్కడా అభ్యర్థులు పిలుపునిస్తున్నారు. ఈ పిలుపును అందుకున్న వాలంటీర్లు అక్కడక్కడా రాజీనామాలు చేస్తున్నారు. మరికొందరు రాజకీయ ఒత్తిళ్లతో చేస్తున్నారు. రాజీనామాలు చేయడం ద్వారా ఎన్నికల్లో వైసిపికి మద్దతుగా ప్రచారం చేయవచ్చనేది వారిభావన. కానీ, ఇలా రాజీనామాల వరకు వెళ్లినవారు ఎంత మంది? రాజీనామా చేయకపోతే వైసిపిపై అభిమానం లేనట్టేనా? ఆ మాటకొస్తే ఇంకా రాజీనామాలు చేయనివారే ఎక్కువ. ఈ లెక్కన వైసిపికే ఎక్కువ నష్టం జరుగుతుంది కదా? ఇదీ విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో ప్రస్తుతం పబ్లిక్ టాక్. వాలంటీర్ల ముసుగు తొలగించుకోండి అంటూ వైసిపి నేతలు బాహాటంగా చెప్తున్న సంగతి తెలిసిందే. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 15,478 మంది గ్రామ, వార్డు వాలంటీర్లు ఉన్నారు. వీరి నియామకం సమయంలో రాజకీయ జోక్యం ఉన్నప్పటికీ నూటికి నూరు శాతం వైసిపికి చెందినవారు అని చెప్పలేం. చాలా చోట్ల డబ్బులు తీసుకుని మరీ వాలంటీర్ల నియామకాలు చేశారు. బంధుత్వాల వల్ల కూడా టిడిపికి చెందినవారికి కొన్నిచోట్ల అవకాశం కల్పించాల్సి వచ్చింది. ఇటువంటి నేపథ్యంలో వాలంటీర్లు కేవలం వైసిపి వైపు మాత్రమే ఉండే పరిస్థితి లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈనేపథ్యంలోనే పార్వతీపురం జిల్లా వీరఘట్టం మండలం కిమ్మి, గడగమ్మ గ్రామాల్లో 28మంది వాలంటీర్లు శనివారం రాజీనామాలు చేశారు. ఇటు విజయనగరం జిల్లాలో పూసపాటిరేగ మండలంలో రెల్లివలస, కుమిలి సచివాలయాల పరిధిలో 77మంది, భోగాపురం మండలం సవరవిల్లి 18మంది చొప్పున వాలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. అంతకు ముందు బొబ్బిలి పట్టణం 30వ వార్డులో 12మంది, విజయనగరంలోనూ నలుగురు రాజీనామాలు చేశారు. విజయనగరంలో 14మంది, ఎల్.కోట మండలం ఖాసాపేటలో ఒకరు, దత్తిరాజేరు మండలం వంగరలో ఒకర్ని చొప్పున ఎన్నికల నిబంధనవాళి ఉల్లంఘించినందుకు అధికారులు విధులనుంచి తప్పించారు. మొత్తంగా ఇప్పటి వరకు 200మంది లోపే రాజీనామాలు చేశారు. రాజీనామాల సంఖ్య ఇంకా పెరగొచ్చు. కానీ, ఇవేవీ రాజకీయాలను ఊహకు అందని రీతిలో ప్రభావితం చేసే పరిస్థితి ఉంటుందా? ఇదే నిజమైతే ఎవరి పాలనలో ఎక్కువ ఉపాధి అవకాశాలు దొరికితే వారికే ఎక్కువ మంది పనిచేస్తారు. ఈలెక్కన టిడిపి సుదీర్ఘ ప్రయాణంలో దశాబ్దాలు తరబడి పాలించింది. ఆయా సందర్భాల్లో ఉద్యోగాలు తెచ్చుకున్నవారంతా ఆ పార్టీకే ఓట్లు వేస్తారా? అన్నది చాలా మంది నోట వినిపిస్తున్నమాట. కాబట్టి ఇటువంటి రాజీనామాలు మాంసం తిన్నామని చెప్పుకోవడం కోసం దుమ్ములు మెడలో కట్టుకోవడం వంటిదే అనేది పబ్లిక్ టాక్.



డైరెక్టు పంపింగ్ ద్వారా నీటిని విడుదల చేస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ

వాడజంగిలో తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని బీరుపాడు పంచాయతీ వాడజంగిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. గ్రామంలో నాలుగు రోజుల కిందట వీచిన ఈదురు గాలులకు వాటర్ ట్యాంక్ కిందపడి బద్దలైంది. దీంతో స్థానిక గిరిజనులకు తాగునీటి సమస్య ఎదురైందని 'ప్రజాశక్తి'లో శనివారం వచ్చిన వార్తకు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రవీణ్ కుమార్ స్పందించారు. వెంటనే గ్రామానికి వెళ్లి తాత్కాలికంగా తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. డైరెక్ట్ పంపింగ్ ద్వారా గ్రామంలో ప్రజలకు తాగునీరు అందుబాటులో ఉంచారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చర్యలు చేపట్టడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

28 మంది వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మి, గడగమ్మ, కొట్టు గుమ్మడ, పాలమెట్ట గ్రామాల నుండి సుమారు 28 మంది గ్రామ వాలంటీర్లు శనివారం తమ పదవికి రాజీనామా చేశారు. అనంతరం రాజీనామా పత్రాన్ని సచివాలయ కార్యదర్శికి అందజేశారు.

8న పింఛనర్ల సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 8న (సోమవారం) రిటైర్డ్ పింఛనుదారుల సమావేశం జరుగుతుందని రిటైర్డ్ ప్రభుత్వ పెన్షన్ దారుల సంఘం కార్యదర్శి డి.గణపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సబ్ ట్రెజరీలో గల రిటైర్డ్ ప్రభుత్వ పింఛన్దారులంతా సమావేశం జరుగుతుందని, కావున ఈ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. మే, జూన్ నెలల్లో ఎండలు అధికంగా ఉన్న దృష్ట్యా ఈ రెండు నెలలు సమావేశం ఉండదని తెలిపారు.

ఏజెన్సీలో విద్యుత్ కోతలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో ఒకవైపు ఎండలు మండిపోతుంటే మరోవైపు విద్యుత్ కోతలు ప్రజలను వేధిస్తున్నాయి. ఎండలు మండుతుండడంతో బయటకు వెళ్లకుండా ఇంటికే పరిమితమవుతున్న ప్రజలు విద్యుత్ కోతల కారణంగా ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఉదయం పూట రెండు గంటలు, అర్ధరాత్రి వేళ విద్యుత్ కోతలు విధిస్తున్నారు. పగటి పూట విద్యుత్ కోతలతో టీవీ, సెల్ పాయింట్ మెకానిక్, వెల్డింగ్ వర్కర్స్ పనులకు, ఫ్రూట్ జ్యూస్ వ్యాపారులకు ఆటంకంగా ఉంటుందని చెబుతున్నారు.



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ రామారావు

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

18 ఏళ్లు నిండిన విద్యార్థిని, విద్యార్థులు ఓటర్లుగా నమోదు చేసుకొని తమ విలువైన ఓటును వేయాలని స్థానిక తహశీల్దార్ రామారావు కోరారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు వినియోగంపై శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఓటు హక్కు విలువ గురించి ప్రతి ఒక్క ఓటరుకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ప్రతి ఒక్క ఓటరు తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే చక్కనైన ప్రజాస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఓటు వినియోగించుకోకపోవడం వల్ల ప్రజాస్వామ్య విలువలను కోల్పోతామని అన్నారు. ఎటువంటి ప్రలోభాలకు, భ్రమలకు గురికాకుండా ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన, విలువలు కలిగిన వ్యక్తులకు అమూల్యమైన ఓటును వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజేంద్ర, ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎస్ పిఒలు రమయ్య, శ్రీనాథ్, టిబిఎలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరంలో నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని లక్ష్మీనారాయణపురంలో శనివారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరంలో నేత్ర వైద్య పరీక్షలు జిల్లా కంటి వెలుగు నేత్ర వైద్యాధికారి నగేష్ రెడ్డి పర్యవేక్షించారు. కంటి వైద్య సహాయకులు ఉమా మాహేశ్వరి పరీక్షలు నిర్వహించారు 4గురికి అంతర కుసుమం, ఒక్కొక్కరికి క్యాటరాక్ట్, 14 మందికి దృష్టి దోషం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని, అలాగే దృష్టి దోషం ఉన్న వారికి ఉచితంగా త్వరలో కళ్ల జోళ్లు అందిస్తామని, సాధారణ వ్యాధులకు మందులతో చికిత్స అందించినట్లు డాక్టర్ నగేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య పర్యవేక్షకు విజయ తదితరులు పాల్గొన్నారు.



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

గొటివాడలో పోలీసులు కవాతు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గొటివాడలో ఎల్విన్‌పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేంద్ర బలగాలతో పోలీసుశాఖ ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.షణ్ముఖరావు, సిఆర్పిఎఫ్ సిఐ ఐఎస్ఎన్ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు సంబంధించిన ఇన్‌ఫిల్ట్రేషన్ బావుల నుంచి పూడిక తీత పనులు చేపడుతున్న కారణంగా ఆదివారం పట్టణంలో తాగునీటి సరఫరా వుండదని కమిషనర్ ప్రసన్న వాణి చెప్పారు. ఈ విషయమై పట్టణ ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిదిమి, కంబర గ్రామాల్లో శనివారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి ప్రదీప్ వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాచిపెంటలో రాజన్నదొర ప్రచారం

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రమైన పాచిపెంట బిసి కాలనీలో గడపగడపకు ఎన్నికల ప్రచారం డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర శనివారం నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గ్రామంలో ఆయనకు ప్రజలు నీరాజనం పడుతూ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో ఆయన ఇంటింటికి వెళ్లి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొట్టాపు ముత్యాలునాయుడు, డోల బాబ్జీ, టి.గౌరీశ్వరరావు, పి.వీరమనాయుడు, వైస్ ఎంపిపిలు ఎం.నారాయణ, కె.రవీంద్ర, ఇజ్జాడ అప్పలనాయుడు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని పలు వార్డుల్లో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేశారు. బెలగాంలోని 20,21 వార్డుల్లోని పట్టణ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకొని ఫ్యాను గుర్తుపై ఓటేసి తనను గెలిపించి ఆశీర్వదించాలని ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ఈ ఐదేళ్లు మీ ఇంటిలో మంచి జరిగితేనే వైసిపి ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు కొండపల్లి బాలకష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, స్థానిక వార్డుల కన్వీనర్లు సామల లలిత కుమారి, చందాన ఆనంద్, జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, కౌన్సిలర్లు, జగన్నాథం టెంపుల్ చైర్మన్ పాలవలస శ్రీనివాసరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎస్ శ్రీనివాసరావు, పిఏసిఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, వైస్ ఎంపిపి సిద్దా జగన్నాథ రావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని ఇరిడి, చెముడుగూడ, కుక్కిడి పంచాయతీల పరిధిలో గల పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా తాటిశీలలో అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుని నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానని ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, జిల్లా నాయకులు గోపాల్ ఉన్నారు.

సీతానగరం : మండలంలోని బక్కుపేటలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు గడప గడపకు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఫ్యాన్ గుర్తుకే మా ఓటు అని మాట ఇస్తూ మీరే మళ్లీ ఎమ్మెల్యే, జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా వస్తారని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మండల, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని కంబర, కాగితాడ, చిట్టిపూడి వలస, కిమ్మి, గడగమ్మ, కొట్టు గుమ్మడ గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమకు మరోసారి పట్టం కట్టాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జడ్పిటిసి జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు, పిఏసిఎస్ డైరెక్టర్ రంభ శ్రీనివాసరావు, కార్యకర్తలు ,అభిమానులు, పాల్గొన్నారు.



పాచిపెంటలోని బిసి కాలనీలో ప్రచారం చేస్తున్న రాజన్నదొర



పార్వతీపురం పట్టణంలో పచారం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



పనుగుపేటలో ప్రచారం చేస్తున్న టిడిపి అభ్యర్థి విజయచంద్ర

పనుగుపేటలో బోనెల ప్రచారం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పునుగుపేటలో పార్వతీపురం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర ఎన్నికల ప్రచారం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు షూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో ద్వారా రాష్ట్ర ప్రజానీకం ఆదుకుంటామన్నారు. మే 13 జరిగే ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని అత్యధిక ఓట్లతో గెలిపించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తెంటు వెంకట అప్పలనాయుడు, వేణుగోపాలనాయుడు, డి.వెంకటనాయుడు, అరవింద్, రామకృష్ణ, భాస్కరరావు, పి.సత్యనారాయణ, పి.లక్ష్మణరావుతో పాటు జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి

గుమ్మలక్ష్మీపురం : కురుపాం నియోజకవర్గ టిడిపి, జనసేన , బిజెపి ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరి గెలుపునకు జనసేన నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు శ్రమించి గెలిపించి తీరుతామని నియోజకవర్గ సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన జనసేన నాయకులతో కలిసి గుమ్మలక్ష్మీపురంలో మాట్లాడారు. జనసైనికులంతా సమిష్టిగా కృషి చేసి ఉమ్మడి అభ్యర్థి గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని, వైసిపిని ఓడించి తీరుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి పెంటా శంకరరావు, వాన ఉపేంద్ర, ఐటి కోఆర్డినేటర్ ఎల్.రంజిత్ కుమార్, గరుగుబిల్లి మండల అధ్యక్షుడు శంకరరావు, నాయకులు రాజేష్, అనంత కుమార్, భార్గవ్, రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూదేవినే అభ్యర్థిగా ప్రకటించాలి

ప్రజాశక్తి - పాలకొండ

పడాల భూదేవికి జనసేన తరుపున అసెంబ్లీ అభ్యర్థిగా తాత్సారం చేయకుండా ప్రకటించాలని ఆమె మద్దతుదారులు కోరారు. శనివారం మధ్యాహ్నం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో భూదేవి మద్దతుదారులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మాజీ జిల్లా పరిషత్తు వైస్ చైర్మన్ కండాపు జ్యోతి, వీరఘట్టం మండల టిడిపి నాయకులు కండాపు వెంకటరమణ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో తమ బృందం సవివరంగా చర్చించారని, పడాల భూదేవిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పవన్‌కల్యాణ్ ఇచ్చిన మాటతప్పరని, ఆయన ప్రకటన కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. మాజీ జెడ్పీటిసి సభ్యులు సామంతుల దామోదర్‌రావు, మాజీ ఎంపిపి సుమంత్ నాయుడు మాట్లాడుతూ జనసేన జెండా ఎగరాలంటే భూదేవికి టికెట్ ఇవ్వాలన్నారు. సీతంపేట మాజీ ఎంపిపి సవర కంపి మాట్లాడుతూ జనసేన గెలవాలంటే, టిడిపి బతకాలన్నా భూదేవితోనే సాధ్యపడుతుందన్నారు. పాలకొండ మాజీ ఉపాధ్యక్షులు సిఎల్ నాయుడు మాట్లాడుతూ భూదేవికే విజయ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ విషయాన్ని ఇరు పార్టీ పెద్దలు ఆలోచించాలని అన్నారు. కార్యక్రమంలో భామిని మాజీ ఎంపిపి ఎస్ఎస్ ప్రకాష్, మాజీ కౌన్సిలర్ గుమ్మిడి సింహాద్రి, శ్రీధర్, ఎస్.సూర్యారావు, జంపు చంద్రశేఖర్, వారాడ ధనుంజయ్, తదితరులు ఉన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి - గరుగుబిల్లి



ఆస్పత్రిలో వృద్ధునికి పింఛను అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి

ప్రభుత్వం ఆదేశాల మేరకు అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి గరుగుబిల్లి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పూడి మన్మధరావు శనివారం వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు. మండల కేంద్రంలోని బిసి కాలనీకి చెందిన కలిశెట్టి వెంకటనాయుడు అనారోగ్యం కారణంగా విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ పింఛన్ వాళ్ల అవసరం నిమిత్తం ఉపయోగం పడుతుందని, భారమని భావించుకుండా ఉద్యోగధర్మం చేపట్టినందుకు ఈ విషయం తెలుసుకున్న గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటనాయుడుకి వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు. ఆస్పత్రికి వెళ్లి ఫించన్‌ను అందజేయడం పట్ల వెల్ఫేర్ అసిస్టెంట్ మన్మధరావుకు పలువురు అభినందించారు.

ఆహ్లాదం కరువాయే...

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

డివిజన్ కేంద్రమైన పాలకొండ నగర పంచాయతీలో ఆహ్లాదం కరువైందని చెప్పవచ్చు. దీని పట్ల ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. సాయంత్రం అయ్యేసరికి ప్రజలు సేద తీర్చుకోవడానికి కనీసం పార్కు కూడా నిర్మించలేదు. పట్టణం నడిబొడ్డున వెంకటరాయ కోనేరు ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. అక్కడున్న విశ్రాంతి ఉపాధ్యాయులు ఎస్వీ ప్రసాద్ రావు చొరవతో గ్రంథాలయం నిర్మించి, మొక్కలు నాటి, ఆలయాన్ని నిర్మించారు. అయితే ఇన్ని ప్రభుత్వాలు మారినా కోనేరు అభివృద్ధిపై మాత్రం దృష్టి పెట్టిన దాఖలాల్లేవు. కొద్ది నెలల క్రితం కోనేరు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు కేటాయించినప్పటికీ పనులు పూర్తి స్థాయిలో జరగలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.60 లక్షలు కేటాయించినప్పటికీ పూడికతీతలు తీసి చేతులు దులుపుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.కోనేరు అభివృద్ధికి పాలకులు, అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి పెట్టిన దాఖలాల్లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే వడమలో కల్యాణ్ చెరువు కూడా అభివృద్ధికి నోచుకున్న దాఖలాల్లేవు. పార్కుగా ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ నేటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. డివిజన్ కేంద్రమైన పాలకొండలో కనీసం ఒక్క పార్క్ కూడా లేకపోవడంతో పట్టణవాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి అయిదేళ్లకు ఒకసారి ఓట్లు అడగడానికి వచ్చిన పాలకులు పాలకొండ పట్టణాన్ని సుందరీకరణ చేస్తామని హామీలు కురిపిస్తున్నారు తప్ప చేసిందేమీ లేదు



అధ్వాహ్నంగా ఉన్న వెంకటరాయుని కోనేరు

ప్రారంభమైన వార్షిక పరీక్షలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు శనివారం నుంచి ప్రారంభమైన పరీక్షలు ఈనెల 19 వరకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరగనున్నాయని ఎంఇఒ నగిరెడ్డి నాగభూషణరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్ష పేపర్లను మండల కేంద్రంలోని ఎంఇఒ కార్యాలయం నుంచి ఏ రోజు పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను ఆరోజు అందజేస్తామన్నారు. ఇంగ్లీష్ మీడియం చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగు మీడియం చదువుతున్న విద్యార్థులకు తెలుగులో ప్రశ్నాపత్రం ఇవ్వడం జరుగుతుందని ఎంఇఒ పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిఒక్కరు విధిగా పరీక్షలు రాయాలని సూచించారు.



సిఐని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

సిఐకు పూర్వపు విద్యార్థుల సన్మానం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని చినమేరంగి సర్కిల్ ఇన్స్పెక్టర్ బోరపు మంగరాజును తనతోటి పూర్వపు విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పదో తరగతి చదువుకున్న విశాఖ జిల్లా ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1993 బ్యాచ్ విద్యార్థులు శనివారం చినమేరంగి పోలీస్ స్టేషన్లో ఘనంగా సన్మానించారు. తమ మిత్రుడు మంగరాజు పదోన్నతి చేపట్టిన సందర్భంగా పూర్వ విద్యార్థులు సుమారు 30 మంది వరకు చినమేరంగిలో కలిసి గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ మంగరాజు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కలవడంతో తిరిగి విద్యార్థి దశలో ఒకే తరగతి గదిలో ఉన్నట్లు అనిపిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. పూర్వ విద్యార్థి పతివాడ రమణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో ఎదిగి ఉన్నత స్థానాలను మంగరాజు అధిరోహించడం గర్వకారణంగా ఉందన్నారు. కార్యక్రమంలో పతివాడ రమణ, మీసాల రామినాయుడు, కంది సత్తిబాబు, దొంతల శ్రీను, దొంతల పాపారావు, దొంతల చిన్న శ్రీను, కోరాడ రాంబాబు, సాడి రమణ, బంటుపల్లి సాధు, కె.ప్రసాద్, సిహెచ్ బంగారు నాయుడు, కంది రామకృష్ణ, ఈశ్వరరావు, సూరిబాబు, జి రమేష్, మన్మధరావు, కొట్యాడ రోహిణి, పద్మ, చంద్ర, వెంకటలక్ష్మి, రెడ్డి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు కృషి : సిఐ

ప్రజాశక్తి - కొమరాడ

ఏజెన్సీలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని పార్వతీపురం సిఐ రవికుమార్ అన్నారు. శనివారం నాగావళి నది ఆవల ఉన్న దలైపేట, కోదులగుంపు, కొట్టు తొడుము, కెమిశీల, ఎగువ గుణద తదితర మారుమూల గిరిజన గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న పరిస్థితులను అధికారులకు తెలియజేసేందుకు పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. మే 13న పోలింగ్ జరుగుతుందని, ముందస్తుగా పోలింగ్ కేంద్రాలకు వద్ద ఎన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలకు ఓటేసినందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ అన్ని సౌకర్యాలు ఏర్పాటు ఎలా ఉన్నాయో ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం పరిశీలిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా గిరిజనులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై కె.నీలకంఠం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సిఐ

గర్భిణులకు హైజెనిక్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గర్భిణీలు ప్రశాంత జీవనం గడపాలని, ప్రతిరోజు మంచి మాటలు చెప్పుకోవాలని, మంచి కథలు వినాలని అప్పుడే సుఖమంతమైన ప్రసవం జరుగుతుందని పుట్టే బిడ్డలు ఆరోగ్యవంతంగా పుడతారని జిల్లా రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ మంచపల్లి శ్రీరాములు అన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక వైటిసిలో ఉన్న 32 మంది గర్భిణీలకు హైజెనిక్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం కిట్లు పంపిణీ చేస్తున్నామని ఇందులో మరింత మంది పేదలను గుర్తించి వారికి దోమతెరలు, దుప్పట్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం వైటిసి మేనేజర్ రాము మాట్లాడుతూ వైటిసి లో ఇప్పటివరకు 1850 మంది గర్భిణులను ప్రసవాలకు ఆసుపత్రికి పంపగా 1700 మంది వరకు సుఖప్రసవాలు జరిగాయని తెలిపారు. వైటిసి లో గర్భిణీలకు పౌష్టికాహారం , ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెడ్ క్రాస్ సభ్యులు పైడా కొండలరావు, గుడ్ల హరిప్రసాద్, పాత్రో వైటిసి సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు హైజెనిటిక్ కిట్లును అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీరాములు

నేరాలు ఘోరాలు

తల్లిదండ్రులు మందలించారని....

ప్రజాశక్తి - సాలూరు రూరల్



తల్లిదండ్రులు మందలించారన్న మనస్థాపంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి...

మండలంలోని సారిక పంచాయితీ దండిగాం గ్రామానికి చెందిన చెడ్డ యెర్రయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్యాభర్తలు ఇద్దరూ కూలీ పనులు చేసుకొంటూ పిల్లలను చదివిస్తున్నారు. పెద్ద కుమార్తె అయిన చెడ్డ పార్వతి (20) పదో తరగతి వరకు చదివింది. ఆ తర్వాత చదవడానికి ఇష్టపడకపోవడంతో వారితో పాటు పొలం, కూలి పనులకు తీసుకొని వెళ్తున్నారు. కొన్ని రోజులు నుంచి తల్లిదండ్రులు చెప్పినట్లు వినకపోవడంతో నెల రోజులు క్రితం మందించారు. అప్పటి నుండి ఆమె కనిపించకలేదు. అయినా తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. ఎక్కడికి వెళ్లిందోనని మదన పడుతున్నారు. అదే గ్రామానికి సమీపాన టేకు తోటలో చెట్టుకు ఉరివేసుకొని ఉండడాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పూర్తి వివరాలు అందాల్సి ఉందని రూరల్ ఎస్ఐ వెంకటరమణ విలేకరులకు తెలిపారు